నేడు బెంగళూరుకు ఢిల్లీ మాజీ సీఎం

బెంగళూరు, జూలై3(ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నాయకురాలు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిశీ శుక్రవారం బెంగళూరుకు రానున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటకలోనే కొంతమేర ఆశాజనకంగా ఉంది. గడిచిన పదేళ్లుగా పార్టీ కార్యకలాపాలు నిరంతరంగా బెంగళూరులో సాగుతున్నాయి. పార్టీ కార్యకర్తల సభలో పాల్గొనేందుకు ఆమె వస్తున్నారు. మధ్యాహ్నం 2గంటలకు ప్యాలెస్ మైదానం గాయిత్రీ విహార్‌కు ఎదురుగా ఉండే అఖిలభారత వీరశైవ మహాసభ ప్రాంగణంలో సభ ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సతీష్‌కుమార్ ప్రకటించారు.

రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది..

- ఆధార్ అనుసంధానానికి 30 వరకు గడువు
- ఉచితాల కోసం తప్పుడు సంఖ్య చూపారా..?
- విద్యాశాఖ సందేహం

పూర్తికాని ఆధార్ ధ్రువీకరణ

బోగస్ విద్యార్థులు..!



బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ విద్య అందాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. కనీసం ప్రాథమిక విద్య అయినా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేకించి 14ఏళ్లలోపు వారికి నిర్బంధ విద్య తప్పనిసరి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ, మధ్యాహ్నభోజనం ఇతరత్రా సదుపాయాలు కల్పిస్తున్నారు. అయితే రాష్ట్రంలో సుమారు 17లక్షల మంది బోగస్ విద్యార్థులు ఉన్నారనే అనుమానాన్ని విద్య, సాక్షరతాశాఖ స్వయంగా వ్యక్తం చేయడం గమనార్హం. ప్రతి విద్యార్థి ప్రోగ్రెస్, ఏ పాఠశాల చదువుతున్నారనే వివరాలతో స్టూడెంట్ అచీవ్‌మెంట్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎస్ఏటీఎస్)ను విద్యాశాఖ అమలు చేస్తోంది. ఈ ఎస్ఏటీఎస్ అనేది ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా పాటిస్తున్నారు. విద్యార్థి హాజరు, ప్రోగ్రెస్ కార్డు, తదుపరి తరగతి పదోన్నతి, టీసీ వంటివి ఇందులో ఉంటాయి. కొత్త విద్యార్థుల అడ్మిషన్‌ను కూడా ఇందులోనే పొందుపరుస్తారు.

రెండేళ్లు గడిచినా...

విద్యార్థుల వివరాలకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రెండు సంవత్సరాలక్రితం ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ కేవీ త్రిలోక్‌చంద్ర అన్నారు. ఈ ప్రక్రియ జాప్యం కావడంతో విద్యాశాఖ అమలు చేస్తున్న పథకాలు, స్కాలర్‌షిప్‌లు ఇతర కార్యక్రమాలకు అడ్డంకిగా మారుతోందన్నారు. ఈ నేపథ్యంలో జూలై 30లోగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని గడువు నిర్ధారించారన్నారు. అలా కాకుంటే సదరు విద్యార్థి నకిలీ అయ్యే అవకాశం ఉందన్నారు.

ఎందుకీ అనుమానం..

రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు 1.04 కోట్ల మంది విద్యార్థులకుగాను సుమారు 17 లక్షలమంది విద్యార్థుల వివరాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న ఉచిత సౌకర్యాలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందనే విమర్శలు వినిపిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, యూనిఫాం, క్షీరభాగ్య ద్వారా ప్రతిరోజూ పాలు, ఇంకా స్కాలర్‌షిప్ తదితర సదుపాయాల కోసం నకిలీలు సృష్టిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో వాస్తవ విద్యార్థుల కంటే ఎక్కువమంది ఉన్నట్టు చూపారనే అనుమానాలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాల్సి ఉంటుంది. విద్యార్థులసంఖ్య పెంచితే ఎక్కువ మంది ఉపాధ్యాయులు సాధ్యమనే భావన ఉందని తెలుస్తోంది.

- లక్షలాదిమంది విద్యార్థుల ధ్రువీకరణ (వ్యాలిడేషన్) ప్రక్రియ ఇంకా జరగలేదు. ఇదేశాఖలో అనుమానానికి తావు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో అంతిమ అవకాశం కల్పించేలా జూలై 30 వరకు అవకాశం కల్పించారు. ఎస్ఏటీఎస్ డేటాలో ఆధార్ నంబరును వాలిడేషన్ తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ నకిలీ అడ్మిషన్ లేదా రికార్డుగా తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్టు విద్యాశాఖ కమిషనర్ తెలిపారు.
- కర్ణాటక పరీక్ష ప్రాధికార (కేఈఏ) ఈ విషయమై స్పందిస్తూ విద్యార్థుల డేటాను ఒక నకిలీ వెబ్‌సైట్ సేకరిస్తోందనే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసుశాఖకు ఫిర్యాదు చేసింది. ఒరిజినల్ వెబ్‌సైట్‌ను పోలినట్టుగా నకిలీ వెబ్‌సైట్ రూపొందించారని, తద్వారా విద్యార్థుల వివరాలు సేకరిస్తోందని పేర్కొన్నారు.

ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినా..

ఎస్ఏటీఎస్‌కు ఆధార్ అనుసంధానం చేసేందుకు విద్యాశాఖ ద్వారా రెండు సంవత్సరాలుగా విడతలవారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించింది. జనవరి 21న వెలువరించిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో 1.04 కోట్ల మంది విద్యార్థులకు గాను 78లక్షల మంది విద్యార్థుల ఆధార్ వ్యాలిడేషన్ జరిగింది. సుమారు 18 లక్షలమంది విద్యార్థుల ఆధార్ వ్యాలిడేషన్ ప్రక్రియ కాలేదు. 8లక్షల మంది విద్యార్థుల ఎస్ఏటీఎస్‌లోని పేరు, ఆధార్ కార్డులోని పేరు ఒకేరకంగా లేకపోవడంతో ఆధార్ లింక్ కాలేదు. ఇలా 26లక్షల మంది విద్యార్థుల ఆధార్ వ్యాలిడేషన్ కాలేదు. జనవరి 30లోగా ప్రక్రియ పూర్తి చేయాలని పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించారు. తద్వారా 9లక్షల మంది విద్యార్థుల ఎస్ఏటీఎస్‌తో అనుసంధాన ప్రక్రియ వేగిరమైంది. ఇంత జరిగినా జూన్ నాటికి ఇంకా 17 లక్షలమంది విద్యార్థుల ప్రక్రియ అలాగే మిగిలిపోయింది. ఇందుకు జూలై 30వరకు గడువు నిర్ధారించారు.

టీసీఎస్ వరల్డ్ 10కేతో రూ.3.83 కోట్ల సేకరణ



10కె రన్ సాధన సంచిక విడుదల చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): టీసీఎస్ వరల్డ్ 10 ద్వారా ఈ ఏడాది ఎన్‌జీఓలు, కార్పొరేటర్‌ల నుంచి రూ.3.83 కోట్ల దాకా నిధులు సేకరించినట్లు టీసీఎస్ రీజనల్ హెడ్ సునిల్‌దేశ్‌పాండే ప్రకటించారు. గురువారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 10కేకు సంబంధించి నిధుల సేకరణతో పాటు భాగస్వామ్యులతో పాటు ఏడాది కాలంలో చేపట్టదలచిన సేవా కార్యక్రమాల వివరాలను ప్రకటించారు. ముఖ్యులుగా పాల్గొన్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పలు విభాగాలలో ప్రత్యేక సేవలు అందించిన వారికి షీల్డులు బహూకరించారు.2008 నుంచి ప్రపంచ అథ్లెటిక్ గోల్డ్ లేబుల్ రేస్ ద్వారా రూ.59.20 కోట్ల దాకా నిధులు సేకరించామన్నారు. వరల్డ్ 10కే ద్వారా సమాజంలో మార్పు తీసుకువచ్చి ఆరోగ్యాన్ని పెంపొందింప చేసుకోవాలనే సందేశం ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది జరిగిన పోటీలకు 13 ఎన్‌జీఓలు పదిలక్షల కంటే ఎక్కువ నిధులు ఇచ్చారన్నారు. 35కుపైగా కంపెనీల నుంచి 1500ల మంది ఉద్యోగులను నియమించుకున్నామని వివిధ సామాజిక కార్యక్రమాలకు రూ.1.86 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఉషా బాళిగా బెంగళూరు కిడ్నీఫౌండేషన్‌కు రూ.17లక్షలు ఫండ్ సాధించడం ద్వారా వ్యక్తిగతంగా ఉత్తమంగా నిలిచారు. మూగప్రాణుల సంక్షేమం, విద్య, మహిళా సాధికారత విభాగాలకు నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఇదే సందర్భంగా ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు ప్రత్యేక బహుమతులను ప్రకటించారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌కు చెందిన మూడు ఫోటోలు ఉత్తమమైనవిగా ప్రత్యేక బోర్డులో ప్రదర్శించారు. ప్రోకాం ఇంటర్నేషనల్ జాయింట్ డైరెక్టర్ వివేక్ సింగ్, కల్నల్ పునీత్ భరద్వాజ్, కబ్బన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


మరో మూడేళ్లు సీఎంగా సిద్దరామయ్య..

అదే ఆరో గ్యారెంటీ

- ప్రతిపక్ష నేత అశోక్ ఎద్దేవా



బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఇదే ఏడాది అక్టోబరు లేదా నవంబరులో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని కానీ మరో మూడేళ్లు సిద్దరామయ్య సీఎంగా కొనసాగుతారంటే ఇది గ్యారెంటీగా ప్రతిపక్షనేత అశోక్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌నేతలకు భయం వేస్తోందన్నారు. ప్రస్తుతం ఆపార్టీ రాష్ట్ర పరిస్థితి ఇల్లు ఒక్కటే కానీ తలుపులు మూడు అనేలా మారిందన్నారు. అందరూ సీఎం కావాలని భావిస్తున్నారని అదే సమస్యగా మారిందన్నారు. సిద్దరామయ్య మరో మూడేళ్లు కొనసాగుతారని అధిష్టానం చెప్పాలి కానీ ఎందుకో ఇటీవల పదేపదే సిద్దరామయ్య అదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారన్నారు. ఇక డీసీఎం డీకే శివకుమార్ కూడా నేను సీఎం సిద్దరామయ్యకు అండగా ఉంటానని బహిరంగంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారాన్ని తన్ని లాగేసుకుంటానని పలుమార్లు చెప్పిన డీకే శివకుమార్ ఎందుకో వెనకబడ్డారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగళూరు యూనివర్సిటీకి పెట్టిన మన్‌మోహన్‌సింగ్ పేరును మారుస్తామన్నారు. చరిత్రాత్మకంగా ఉన్న పేర్లను చిన్నపాటి కారణాలు చూపి మార్చడం సరికాదన్నారు. అభివృద్ధి చేయాలి కానీ బోర్డులు మార్చడం ఏమిటని ప్రశ్నించారు. కులగణనలో సిద్దరామయ్యకు చుక్కెదురయ్యిందన్నారు. మరోసారి సర్వే జరిపితే దానికి విలువ ఉండదన్నారు కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదన్నారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తే సంఘటనలు మరో చరిత్ర సృష్టిస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఎన్నోరాష్ట్రాల గవర్నర్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఎందరో ఆర్ఎస్ఎస్‌కు చెందినవారు ఉన్నారన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి తెలుసుకుని మాట్లాడాలంటూ హితవు పలికారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో లేని పదాలను చేర్చారని ఇందుకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్నారు.



విద్యుత్ వెలుగుల్లో తుంగభద్ర జలాశయం

తుంగభద్ర పరవళ్లు..!

- 20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

బళ్లారి గాంధీనగర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర పైభాగం పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. అధిక ప్రమాణంలో జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రస్తుతం జలాశయానికి 30వేల క్యూసెక్కులకు పైగా నీరు వచ్చి చేరుతుండగా జలాశయం భద్రత దృష్ట్యా 80 టీఎంసీల సామర్థ్యం దాటగానే వచ్చిన నీటిని అలేగా దిగువకు అధికారులు వదులుతున్నారు. నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను బోర్డు అధికారులు అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి 20 క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 2.5 అడుగులు ఎత్తి ఒక్కో గేటు నుంచి 2,913 క్యూసెక్కుల చొప్పు మొత్తం 58,260 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయంలో వరద నీరు పెరిగేకొద్దీ మరిన్ని గేట్ల ద్వారా నీటిని వదిలే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు. జలాశయం ఎత్తు 1633 అడుగులు ఉండగా, ప్రస్తుతం డ్యామ్‌లో 1625.3 అడుగులకు నీరు చేరింది. జలాశయంలోకి 30వేల క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతుండగా, సాగునీటి కాలువలతో కలిపి మొత్తం 62,268 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 79 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1587 అడుగులకు నీరు చేరుకోగా, 10,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 16.32 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు వారు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన నీరజ్ చోప్రా



నీరజ్ చోప్రాను సన్మానించి, జెర్సీని అందిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్ విజేత, ప్రపంచ జావెలియన్ త్రో చాంపియన్ నీరజ్‌చోప్రా బెంగళూరుకు వచ్చారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు. అధికారిక నివాసం కావేరిలో సీఎంను కలిసి కాసేపు ముచ్చటించారు. ఇదే సందర్భంగా నీరజ్‌చోప్రాకు మైసూరు పాగాతో సీఎం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు తదితరులు ఉన్నారు. శనివారం కంఠీరవా స్టేడియంలో జరిగే క్లాసిక్ జావెలియన్ పోటీలలో నీరజ్ చోప్రా పాల్గొంటారు.

శ్రావ్యమైన కవితలు అందించాలి

- కనకదాసు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు చిక్కన్న



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చిక్కన్న

బళ్లారి సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజానికి శ్రావ్యమైన కవితలు అందించాలని బెంగళూరులోని సంతకవి కనకదాసు తత్వసాధకుల అధ్యయనకేంద్రం అధ్యక్షుడు టి.చిక్కన్న అన్నారు. గురువారం విజయనగర శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో బెంగళూరులోని సంతకవి కనకదాసు తత్వపదకర అధ్యయన కేంద్రం, విశ్వవిద్యాలయంలోని కన్నడ అధ్యయన విభాగం సంయుక్తంగా కన్నడ కవితా వారసత్వం, కనకదాస అనే అంశంపై రెండు రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కన్నడ కవితా సంప్రదాయంలో కనకదాసును ఉన్నత స్థానంలో ఉంచామన్నారు. 15వ శతాబ్దానికి చెందిన కనకదాసు కవిత్వం, తాత్విక సూక్తులు వాటి మానవ విలువల కారణంగా నేటికీ సంబంధితంగా ఉన్నాయన్నారు. అవి సమాజంలోని సంక్లిష్ట వ్యవస్థకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. చాలా మంది కవులు సమాజ మంచి కోసం దార్శనికులుగా మారారని అన్నారు. కనకదాసు కీర్తనలు ప్రజల సామాజిక జీవిత వాస్తవాలను గుర్తించాయన్నారు. సామాజిక జీవితాన్ని సరిదిద్దడం ద్వారా ఆయన ప్రజల్లో అవగాహన వెలుగును వెలిగించారని కొనియాడారు. కనకదాసు తన కాలంలోని సంక్లిష్ట వ్యవస్థను కవిత్వం ద్వారా వివరించారన్నారు. విద్యార్థులు చర్చాకార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తమ జ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రాజెక్టులు నిర్వహించామని అన్నారు. వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న..

మతపరమైన నేరాలు..!

నాలుగేళ్లలో 65 శాతం అధికం

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఒకప్పుడు సర్వ జనాంగద శాంతియ తోట (అన్ని మతాల శాంతివనం) అని పేరుండేది. కర్ణాటకలో మతాలకు సంబంధించిన నేరాలు ఇటీవల పెరుగుతున్నాయి. మతం పేరిట హత్య, దాడి, దౌర్జన్యం వంటి ఘటనలు నిరంతరం చోటు చేసుకుంటున్నారు. 2021లో 208 కేసులు నమోదు కాగా 2024లో 345కు చేరాయి తద్వారా నాలుగేళ్లలో సుమారు 65శాతం పెరిగింది.

మే వరకు 123 కేసులు

స్టేట్ క్రైం రికార్డ్స్ బ్యూరో కర్ణాటక వెల్లడించిన గణాంకాల ప్రకారం ప్రస్తుత ఏడాది మే వరకు 123 కేసులు నమోదయ్యాయి. గతంతో పోలిస్తే మతఘర్షణలు, ధార్మిక గొడవలు 133.31 శాతం పెరిగాయి. 2021లో ఇలాంటివి 9 కేసులు నమోదయ్యాయి. 2024లో 21కి పెరిగాయి సోషల్‌మీడియాలో తప్పుడు సమాచారం, రాజకీయ విభజన వాతావరణం, కొన్ని జిల్లాల్లో దీర్ఘకాలికంగా ధార్మిక లేదా కుల ఆధార ఉద్రిక్తతలు కూడా ఇలాంటి ఘటనలు పెరిగేందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

మతఘర్షణల నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ జిల్లాల్లో తరచూ మతఘర్షణలు చోటు చేసుకుంటుంటాయి. వీటిని నియంత్రించేందుకు నక్సల్స్ నియంత్రణ దళంలోని సభ్యులను స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌గా నియమించారు. మతానికి సంబంధించి నేరాలను వివిధ సెక్షన్‌ల కింద విభజించారు. కుల ఆధారిత, సామూహిక, భాషా పరమైన, ప్రాంతీయ, ధార్మిక ఇతర అంశాలుగా విభజించారు. దీనిపై పోలీస్ కమిషనర్ ఒకరు స్పందిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, రాజకీయ విభజన, ధార్మిక అంశాలపై ఒక్కోసారి ఉద్రిక్తత చెలరేగేలా పోస్టింగ్‌లు పెట్టడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, నిందితులను అరెస్టు చేసినప్పటికీ వారిపై గూండా యాక్ట్ తదితర కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలవుతున్నట్టు అభిప్రాయపడ్డారు. మతఘర్షణలకు పరోక్షంగా సహకరించిన నిందితులకు రాజకీయ పార్టీలు, నాయకుల అండదండలు ఉండడంతో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉందని అభిప్రాయపడ్డారు. ఏదేమైనా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు చేసేవారిపై నిఘా పెంచినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.



చెట్టును ఢీకొన్న కారు.. గర్భిణి మృతి

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): కోలార్ జిల్లా మాళూరు తాలూకా భావనహళ్లి గ్రామ పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న లారీను తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో గర్భిణీ అర్చనా(25) తలతో పాటు ఎడమ చేయి తెగిపడింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడ్డారు. గర్భిణీని ఇంటికి తీసుకువచ్చేందుకు ఆమె భర్త కారులో వెళ్లారు. మాళూరు సమీపంలోని పుర గేట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పడంతో కారు చెట్టును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన భర్తను ఆసుపత్రికి తరలించారు. మాళూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి
ఎంపీ తుకారాం

8
ప్రబలుతున్న డెంగీ, మలేరియా
శాంతినగర్‌లో ఇంటింటా బాధితులు
ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు
పట్టించుకోని వైద్యశాఖ అధికారులు



మార్కెట్‌కు తరలించడానికి పండ్లను సిద్ధం చేస్తున్న కూలీ

ఆదాయంలో నేరేడు

మూడెకరాల్లో సాగు చేసిన రైతు

ఏడాదికి రూ.ఆరు లక్షల లాభం

ఔషధ గుణాలతో పెరుగుతున్న డిమాండ్

బెళుగుప్ప, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతు హరిదాస్ చౌదరి అల్లనేరేడు పంటతో అధిక లాభాలు గడిస్తున్నాడు. పుష్కర కాలం కిందట ఆర్డీటీ పంపిణీ చేసిన బహు డోలి రకం అల్లనేరేడు మొక్కలు ఒక్కోటి రూ.40లతో కొనుగోలు చేశాడు. మూడు ఎకరాలలో 140 మొక్కలను 20-20 దూరంలో నాటి బోరుబావి నీటితో సంరక్షించాడు. ఐదేళ్లకు పంట చేతికొచ్చింది. పూత, కాయలకు పురుగు ఆశించకుండా క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపాడు. మూడు ఎకరాలకు పురుగుమందులు, ఎరువులు, కూలీ ఖర్చు అన్నీ కలిపి ప్రతి ఏటా రూ. 80 వేల నుంచి రూ.90 వేలు పెట్టుబడి వస్తుందని రైతు తెలిపారు. దిగుబడి, మార్కెట్‌లో ధరను బట్టి ఏడాదికి ఐదారు లక్షల రూపాయాల ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది తోటలోనే రూ.ఆరు లక్షలకు వ్యాపారులకే విక్రయించినట్లు తెలిపారు. పంట దిగుబడిని బట్టి ధరలో మార్పు ఉంటుందన్నారు. నేరేడు పండ్లు మధుమేహం, జీర్ణక్రియ, మెదడు, గుండెకు ఔషధంగా పని చేస్తాయన్న నమ్మకంతో మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోందన్నారు.



దిగుబడిని చూపుతున్న రైతు హరిదాస్ చౌదరి



విరగాసిన నేరేడు పండ్లు

ఉద్యాన పంటలే మేలు

మెట్ట భూముల్లో వర్షాధార పంటలు సాగు చేసి అప్పుల పాలయ్యాం. కష్టాల్లో ఉన్న రైతులకు ఉద్యాన పంటలు ఎంతో ఆదాయాన్నిస్తున్నాయి. నా కుమారుడు శశిధర్ సహకారంతో 15 ఎకరాలలో మామిడి, అల్లనేరేడు, అరటి పంట సాగు చేస్తున్నాం. గిట్టుబాటు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యం ఉంటే ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకం.

- హరిదాస్ చౌదరి, నరసాపురం

వీధికుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

- నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధికుక్కలు, పశువులు, పందుల సమస్యను ప్రభుత్వానికి నివేదించామనీ, పూర్తిస్థాయిలో పరిష్కారం చూపుతామని అనంత నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి, సమస్యలపై కమిషనర్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: అనంత నగర పాలక సంస్థ పరిధి ఎంత...?

కమిషనర్: అనంత నగరపాలక సంస్థ 376 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇందులో 50 డివిజన్లు, 28 రెవెన్యూ వార్డులు, 6 శానిటేషన్ సర్కిళ్లు ఉన్నాయి. 74వేల ఇళ్లు ఉన్నాయి. 3లక్షలకుపైగా జనాభా ఉంది.

ప్రశ్న: నగరంలో అభివృద్ధి ఎలా చేస్తున్నారు?

కమిషనర్: నగరంలో ఆదాయం, ఖర్చును బేరీజు చేసుకుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధుల ఆధారంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం.

ప్రశ్న: డంపింగ్ యార్డు సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

కమిషనర్: జనాభా పెరుగుదలతో సమస్యగా మారిన డంపింగ్ యార్డుకు పరిష్కారమార్గం చూపాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. నగర సమీపంలో వందెకరాల స్థలం చూపితే డంపింగ్ యార్డు మార్చడానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నగరంలో వీధికుక్కలు, ఆవులు, పందుల సమస్య ఎక్కువగా ఉంది...?

కమిషనర్: అవును. వీధికుక్కలు, ఆవులు, పందుల సమస్యపై ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎలా తరలించాలనే అంశంపై సమాలోచనలు చేస్తున్నాం. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మెప్మా పరిధిలో మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి?

కమిషనర్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో 4,062 స్వయం సహాయక మహిళా సంఘాల్లో 40,620 మంది సభ్యులు ఉన్నారు.

లాభాల డ్రాగన్...!

సేద్యంలో రాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



డ్రాగన్ పంట

- ఐదెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు
- అధిక దిగుబడులు, ఆదాయం
- టెకీ వేమారెడ్డి విజయగాథ

నీటిశాతం తక్కువగా ఉండి, మెట్ట భూముల్లో పండే డ్రాగన్ ఫ్రూట్ పంట ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంట సిరులు కురిపిస్తోంది. పంట సాగుకు ఒక్కసారి పెట్టుబడి పెడితే కొన్నేళ్ల వరకూ స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుంది. అలాంటి పంటను సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు ఆదాయాన్ని సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు అన్నమయ్య జిల్లా గుండ్లచెరువుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వేమారెడ్డి. ఉద్యోగం చేస్తూనే సేద్యంలో అధిక ఫలసాయం సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

- ఆంధ్రజ్యోతి, నంబులపూలకుంట



వేమారెడ్డి



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా డ్రాగన్

వేమారెడ్డిది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి పొలం పనులు చూస్తూ, చేస్తూ విద్యాభ్యాసం కొనసాగించాడు. ఈక్రమంలోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఈయనకు ఏడాదికి రూ.32 లక్షల ప్యాకేజీ ఉన్నట్లు తెలిపాడు. ఈయన భార్య కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే.

సేద్యంపై మక్కువతో

ఇద్దరూ బెంగళూరులోనే పని చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. మంచి ప్యాకేజీ, విలాసవంతమైన జీవితం అయినా ఆ రైతు బిడ్డకు ఏదో తెలియని వెలితి. వ్యవసాయం చేయాలన్న కోరిక రోజురోజుకు పెరగసాగింది. ఈక్రమంలోనే సంప్రదాయ వ్యవసాయం కాకుండా ఆధునిక వ్యవసాయం వైపు మళ్లాడు.

60 సెంట్లలో మొదలు పెట్టి..

వేమారెడ్డికి తన తండ్రి నుంచి వారసత్వంగా 60 సెంట్ల భూమి వచ్చింది. అందులోనే జైన్‌రెడ్ రకం డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేశాడు. ఆ రకం పంటకు భూమి అనుకూలంగా లేకపోవడంతో దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో అక్కడ వదిలేశాడు. తర్వాత భూములు తక్కువ ధరకు దొరికే నంబులపూలకుంట మండలంలోని జౌకల గ్రామం వద్ద 16 ఎకరాలు కొనుగోలు చేశాడు. అందులో కూడా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేయాలని తలిచాడు. అందుకే ప్రయోగాత్మకంగా కేరళ నుంచి ఎల్లోఫైర్ రకం డ్రాగన్ ఫ్రూట్ కొమ్మలను రెండింటిని తెప్పించి సాగుచేశాడు. అవి కూడా ఇక్కడి నేలలకు సరిపోలేదు. దీంతో ఇక్కడి ఎర్ర నేలకు అనుకూలమైన అమెరికన్ బ్యూటీ, జైన్‌రెడ్ రకాలను మూడేళ్ల కిందట తెప్పించి సాగు చేశాడు. ఈ రెండు రకాలను ఎకరాకు వెయ్యి చొప్పున ఐదు ఎకరాల్లో సాగు చేశాడు. ఒక్కో మొక్కను రూ.50తో కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఒక్కో మొక్క జీవిత కాలం దాదాపు 30 సంవత్సరాలు ఉంటుందని వేమారెడ్డి తెలిపారు.

సాగు ఇలా..

డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు స్తంభాలు, స్టేవైర్, కడ్డీలు, మొక్కలు మొత్తం కలిపి దాదాపు రూ.నాలుగైదు లక్షలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత దాదాపు మూడు దశాబ్దాల పాటు పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉండదు. ఈపంటకు చీడపీడల బెడద ఉండదు. పంట సాగు చేయాలంటే ముంగారు వర్షాలకు ముందే కొమ్మలు నాటుకోవాలి. సేంద్రియ ఎరువులు వినియోగించాలి. కొమ్మలు నాటిన 11నెలలకు పూత పూస్తాయి. మొగ్గదశ నుంచి 52రోజులకు కాయలు కోతకొస్తాయి. కాయ కోసిన 16రోజులు వరకు నిల్వ ఉంచుకోవచ్చు. పొలం వద్దే కిలో రూ.120 వంతున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులకు ఒక్కసారి రెండువందల కిలోలు కోతకు వస్తున్నాయన్నారు. కాయదశలో ఉన్న సమయంలో సేంద్రియ ఎరువులు బాగా వినియోగిస్తే, ఒక్కో కాయ కిలో వరకు వచ్చే అవకాశం ఉంది. నీరు తక్కువగా వినియోగించాలి. ఫిబ్రవరి నెల తరువాత నెలకు ఒకసారి మాత్రమే నీరు అందించాలి. ఏప్రిల్, మే నెలలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలు దాటితే కొమ్మలు పసుపు రంగులోకి మారిపోతాయి. ఎండకాలంలో పూర్తిగా కొమ్మలు ఎండిపోయి, ముంగారు వర్షాలకు చిగురించి, పచ్చగా మారుతాయి. మంచుకాలంలో ఫంగస్ రాకుండా నియంత్రించడానికి రసాయనిక మందులు వాడాల్సి ఉంటుంది.



మొగ్గ దశలో ఉన్న డ్రాగన్

ఏడాదికి నాలుగు కోతలు

సస్యరక్షణ పద్ధతులు పాటించి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే సాగు చేసిన ఏడాదిలోనే పంట చేతికొస్తుంది. ఈపంట సాగు ప్రారంభంలోనే భారీ పెట్టుబడి తప్ప ఆ తర్వాత పెద్దగా ఖర్చులు ఉండవు. కలుపు, కూలీల ఖర్చు ఉండదు. కాయ కోతదశలో ఒకరిద్దరు కూలీలు రెండువందల కిలోలను కత్తెరతో కోయాల్సి ఉంది. పొలాల వద్దకే వ్యాపారులు వచ్చి టన్ను రూ.1.2లక్షల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోతలు ఉంటాయి. ప్రతి కోతకు ఎకరాకు 1.5 టన్నుల టన్నుల దిగుబడి వస్తున్నట్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వేమారెడ్డి తెలిపారు. పొలం వద్ద తన తల్లిదండ్రులు ఉంటారని, తాను ప్రతి శని, ఆదివారాల్లో అక్కడికి వెళ్లి పంటను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. డ్రాగన్‌ఫ్రూట్ ఆరోగ్యానికి మంచిదని, నీరు తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సహించాలని ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సూచిస్తున్నారు.

పోలీసులతో చర్చించండి

- సమస్య, పరిష్కారం వివరాలు మా ముందు ఉంచండి
- ఇస్కాన్ ప్రతినిధులు, పోలీసులకు హైకోర్టు ఆదేశం
- రథయాత్ర సమస్యపై విచారణ నేటికి వాయిదా

అమరావతి, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 5న నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రకు సంబంధించి పోలీసు అధికారులతో ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని ఇస్కాన్ ప్రతి నిధులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. గురువారం సాయంత్రం అనంతపురం ఎస్‌డీపీవో వద్ద కూర్చొని రథయాత్రకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని పేర్కొంది. రథయాత్ర, మొహర్రం పండుగ ఊరేగింపు ఒకే రోజున ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ ఉత్తర్వులు ఇస్తున్నట్లు పేర్కొంది. సమస్యకు పరిష్కారం కనుగొని ఆ వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఇస్కాన్ ప్రతి నిధులు, పోలీసులకు స్పష్టం చేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘు నందనరావు కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతపురంలో ఈనెల 5న ఇస్కాన్ తలపెట్టిన రథయాత్రకు అనుమతి ఇవ్వాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పోలీసులు అప్పీల్ దాఖలు చేశారు. అదే రోజున ముస్లింలు మొహర్రం పండుగ ఊరేగింపు ఉందని, ఈ రెండు ఒకే మార్గంలో వెళ్తే శాంతి భద్రత సమస్య తలెత్తే ప్రమాదం ఉందని, అందువల్ల సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాలని అప్పీల్‌లో కోరారు. ఈ అప్పీల్‌ను ధర్మాసనం లంచ్‌మోషన్‌గా స్వీకరించి అత్యవసరంగా విచారణ జరిపింది. పోలీసుల తరపున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.... ఈ నెల 5న రథయాత్రకు అనుమతి ఇవ్వాలని ఇస్కాన్‌వారు పోలీసులను కోరారన్నారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి ముస్లింల మొహర్రం పండుగ ఊరేగింపు ప్రారంభమౌతుందన్నారు. రథయాత్ర నిర్వహణకు ఇస్కాన్ ప్రతిపాదించిన దారిలో పలు మసీదులు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ముస్లిం జనాభా కూడా అధికంగా ఉంటుం దని వివరించారు. ఈనేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు ఈ నెల 5న ఇస్కాన్ రథయాత్రకు పోలీసులు అనుమతివ్వలేదన్నారు. అయితే ఇస్కాన్ ప్రతిపాదించిన రూట్లో రథయాత్రకు అనుమతివ్వాలని సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారని, అందుకే అప్పీల్ వేశామన్నారు. ఇస్కాన్ రథయాత్ర ఈ నెల 4న లేదా 7న నిర్వహించుకుంటే అభ్యంతరం లేదన్నారు. రథయాత్రకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నామని ఇస్కాన్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ప్రతినిధులకు ఆహ్వానాలు కూడా అందజేశా మన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కళాకారులు రానున్నారని, వారి టికెట్లు కూడా ఇప్పటికే బుక్కు అయ్యాయని వివరించారు. ఏజీ స్పందిస్తూ... అదే రోజు ప్రత్యామ్నాయ రూట్లలో రథయాత్రను నిర్వహించుకున్నా అభ్యంతరం లేదన్నారు.

ఒక్క రోజే జగన్నాథ రథయాత్ర

ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ మందిర చైర్మన్ గౌరంగదాస్

అనంతపురం టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్రను ఈనెల 5న ఒక్కరోజే నిర్వహించనున్నట్లు ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్ పేర్కొన్నారు. నగరశివారులోని ఇస్కాన్ మందిరంలో గురువారం ఆయన జగన్నాథ రథయాత్ర వివరాలను విలేకరులకు వివరించారు. 5, 6వ తేదీల్లో రథయాత్ర నిర్వహించేలా ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. మొహర్రం పండుగ నేపథ్యంలో ఆరో తేదీ కార్యక్రమాలకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో కార్యక్రమాన్ని రెండు రోజులకు బదులుగా ఒక్కరోజుకే పరిమితం చేసుకున్నట్లు తెలిపారు. 5న ఉదయం 10 గంటలకు లలితకళాపరిషత్‌లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వాములకు అభిషేకాలు, మధ్యాహ్నం 2.30 గంటలకు నగరపాలకసంస్థ కార్యాలయం ముందు నుంచి రథయాత్ర ప్రారంభమై సప్తగిరి సర్కిల్, క్లాక్‌టవర్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, గాంధీ బజార్, బసవన్నకట్ట, ఐరన్ బ్రిడ్జి మీదుగా తిరిగి రాత్రి 7 గంటలకు లలితకళాపరిషత్‌కు చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి సినీ హీరో సుమన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, రాత్రి 7 గంటలకు సత్యగోపినాథ్ స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారన్నారు.

సోలార్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలపండి

ఆర్డీవో వసంతబాబు



మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

కంబదూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలా..? వద్దా..? అన్న విషయాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆర్డీవో వసంత బాబు.. గ్రామస్థులకు సూచించారు. గురువారం మండలంలోని చెన్నంపల్లిలో ఏపీఎన్‌హెచ్‌ఏఎల్, ఎన్ఆర్ఈడీసీఏపీ కంపెనీల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రైతులు, గ్రామస్థులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ బాలకిషన్, సోలార్ పవర్ ప్రాజెక్టు ప్రతినిధులు హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేయబోతున్న సోలార్ ప్రాజెక్టు విషయంలో అధికారులకు అభ్యంతరాలు చెప్పుకోవచ్చన్నారు. భూసేకరణ, ఎకరాకు ఎంత ఇస్తున్నాం అన్న వివరాలు స్పష్టంగా ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రాజెక్టు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, రిటైర్డ్ తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, సర్పంచ్ కోకా ముత్యాలమ్మ, ఎన్‌టీపీసీ ఏజీఎంలు శివకుమార్, బాలాజీ పాల్గొన్నారు.

మార్పునకు నిర్దేశకుడు.. పవన్ కల్యాణ్

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం వైద్యం, జూలై 3(ఆంధ్రజ్యోతి): కథానాయకుడిగా సమాజ మార్పునకు పవన్ కల్యాణ్ నిర్దేశకుడు అని అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పేర్కొన్నారు. గురువారం పవన్ కల్యాణ్ నూతన చిత్రం 'హరహర వీరమల్లు' ట్రైలర్ విడుదలను టీసీ వరుణ్‌తోపాటు అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవాని రవికుమార్.. మెగా అభిమానుల మధ్య వీక్షించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, పవన్‌కుమార్, మణికంఠ, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీపతి, దివాకర్, సంజీవరాయుడు, విజయకుమార్, హుస్సేన్, సంపత్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీసీ వరుణ్, భవాని రవికుమార్

పాజిటివ్ రెస్పాన్స్ పెంచండి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మరింత సంతృప్త స్థాయి, పాజిటివ్ రెస్పాన్స్ పెరగడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి డీఆర్డీఏ, పౌర సరఫరాలు, వైద్యఆరోగ్య, ఏపీఎస్ ఆర్టీసీ, మున్సిపాలిటీ, ల్యాండ్ సర్వే, అన్న క్యాంటీన్లు, విద్యుత్ తదితర శాఖల పనితీరుకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేశారు. దీనిపై గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా స్పందన సర్వేను ఉన్నత స్థాయిలో సమీక్షిస్తున్నారని, అన్ని శాఖల వారు సంబంధిత అంశానికి సంబంధించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తయారు చేయాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి ఐవీఆర్ఎస్ అనాలసిస్ సర్వే సంబంధించి పీపీటీ తయారు చేయాలని అధికారుల ను ఆదేశించారు.

శరవేగంగా..!

లక్ష్యం దిశగా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు

భారీ యంత్రాలతో చేపడుతున్న వైనం

గడువులోపే పూర్తయ్యే అవకాశాలు

లైనింగ్ సందేహమే..!

అయినా.. నీటి పారుదలకు ఇబ్బంది లేదంటున్న అధికారులు



కెనాల్ డీప్‌కట్‌లో బ్లాస్టింగ్‌కు పనులు చేపడుతున్న దృశ్యం



డీప్‌కట్ బ్లాస్టింగ్‌లో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం



కసాపురం వద్ద పూర్తయిన కాలువ బండ్ వైడెనింగ్ పనులు

గుంతకల్లు, జూలై 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు లక్ష్యం దిశగా పరుగులు తీస్తున్నాయి. ప్రభుత్వం విధించిన గడువు కల్లా పనులను పూర్తిచేసి, కాలువను సిద్ధం చేయడంపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మరో వారం రోజుల్లో వైడెనింగ్, బండ్ ఆర్త్ వర్కులు పూర్తికానున్నాయి. బండ్ లైనింగ్ మినహా ఇతర పనులన్నీ పూర్తిచేస్తామని అధికారులు తెలియజేస్తున్నారు. హంద్రీనీవా కాలువ డీప్‌కట్‌లో కొన్నిచోట్ల బ్లాస్టింగ్ పనులు పెండింగులో ఉండగా.. గడువులోపు అవన్నీ పూర్తవుతాయని చెబుతున్నారు.


95 శాతం పూర్తి

సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీకి అనుగుణంగా నిలిచిపోయిన వైడెనింగ్ పనులను పునః ప్రారంభించారు. గత ఫిబ్రవరిలో రూ.3,873 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. మార్చి 15న పనులను ప్రారంభించారు. ఈనెల 12వ తేదీలోపు పూర్తిచేసి, ఖరీఫ్ సీజన్‌కల్లా హంద్రీనీవా కాలువను నీటి పారుదలకు సిద్ధంగా ఉంచాలని లక్ష్యం విధించారు. హంద్రీనీవా తొలి దశ కింద 216 కి.మీ.ల కాలువ వెడల్పు పనుల కోసం కనీవినీ ఎరుగని రీతిలో భారీ సంఖ్యలో యంత్రాలను తెచ్చి వినియోగించారు. భూమికి సమాంతరంగా నీరు పారే ప్రదేశాల్లో మట్టికట్టలు, డీప్‌కట్‌లో రాళ్ల తొలిగింపుపై ప్రత్యేక దృష్టి సారించి, పనులు వేగవంతంగా నిర్వహించారు. కసాపురం గ్రామం వద్ద, 143 కి.మీ., 148 కి.మీ.ల వద్ద కాలువలో బ్లాస్టింగ్ పనులు మినహా వైడెనింగ్ పూర్తయింది. ఈనెల 12 వరకూ గడువు ఉండగా, ఆలోపే పనులు పూర్తవుతాయని, సిమెంటు లైనింగ్ పెండింగు పడినా తర్వాత పూర్తి చేసుకోవచ్చని అధికారులు వివరిస్తున్నారు. ఆర్త్ వర్కులు దాదాపు 95 శాతం పూర్తికాగా మరో పది, పదిహేను రోజుల్లో వైడెనింగ్ వందశాతం పూర్తి చేయనున్నారు.

లైనింగ్ పనులు పెండింగే..

హంద్రీనీవా వైడెనింగ్‌లో ఆర్త్ వర్క్ వైడెనింగ్‌తో పాటు బండ్ లైనింగ్, స్ట్రక్చర్స్ వద్ద లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. గడువులోపు వైడెనింగ్ పనులను పూర్తిచేసే పరిస్థితులు ఉన్నా.. లైనింగ్ పెండింగ్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని సీపీ ప్యాపిలి వద్ద ఉన్న మట్టికట్టకు లైనింగ్ పనులు చేపట్టారు. కసాపురం, జీ కొట్టాల గ్రామాల వద్ద ఉన్న బండ్‌లకు ఇంకా కాంక్రీట్ లైనింగ్ పనులను చేపట్టలేదు. కాలువలో ఉన్న పలు వంతెనలు, యూటీఎస్‌ల వద్ద లైనింగ్ పనులను ప్రారంభించనేలేదు. ఈ పనులు ఈ సీజన్‌లో చేపట్టి, పూర్తి చేసే అవకాశాలు కనిపించడంలేదు. వైడెనింగ్ వరకూ వందశాతం వర్కులు పూర్తికానున్నాయి. పెండింగ్‌లో ఉన్న అరకొర ఆర్త్ వర్కులకు పక్షంరోజులు పట్టే అవకాశం ఉంది.

పదిరోజుల్లో పూర్తవుతాయి



జిల్లాలో హంద్రీనీవా కాలువ వైడెనింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. బుగ్గసంగాల, కసాపురం గ్రామాల వద్ద డీప్ కట్‌లో బ్లాస్టింగ్ పనులు కొనసాగుతున్నాయి. అవన్నీ పదిరోజుల్లో పూర్తవుతాయి. కొంత సమయం లభిస్తే లైనింగ్ పనులు కూడా పూర్తయ్యే అవకాశం ఉంది. లైనింగ్ పనులు పూర్తి కాకున్నా, నీటి పారుదలకు సమస్యలేదు. పది రోజుల్లో వర్షాలు వచ్చి అంతరాయం కలగకపోతే పనులు సకాలంలో, గడువులోపే పూర్తిచేస్తాం.

-శ్రీనివాసనాయక్, హంద్రీనీవా గుంతకల్లు సర్కిల్ ఈఈ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

స్వామి వివేకానంద (వర్ధంతి)



అమెరికా దేశం చికాగోలో జరిగిన ప్రపంచ ధర్మసమ్మేళనంలో 'సోదర సోదరీమణులారా...' అంటూ సంబోధించి హిందూధర్మ గొప్పదనాన్ని చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద 1863 జనవరి 12న కోల్కత్తాలో జన్మించారు. హిందూధర్మ ఉద్ధరణకు పాటుపడడమే కాక యోగాను ప్రపంచానికి చాటిన ఆయన అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. హిందూ సాధువు, తత్వవేత్త. గురువు రామకృష్ణ పరమహంస పేరిట మఠాన్ని, మిషన్‌ను స్థాపించారు. వందలాది సదస్సులలో ప్రసంగించి యువతను చైతన్యపరిచారు. 1902 జూలై 4న కన్నుమూశారు. కాగా ఆయన జయంతిని జాతీయ యువదినోత్సవంగా ఆచరిస్తున్నారు.

పింగళి వెంకయ్య (వర్ధంతి)



దేశ జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగాను, విద్యావేత్తగాను గుర్తింపు పొందారు. ఎంతోమంది పతాకాలు రూపొందించినా పింగళి రూపొందించిన పతాకాన్ని మహాత్మా గాంధీజీ సూచన మేరకు త్రివర్ణ పతాకంలో రాట్నం చిహ్నంకు బదులుగా అశోకచక్రం చిహ్నంతో 1947లో ఖరారు చేశారు. నిరాడంబర, నిస్వార్థ జీవితం గడిపిన ఆయన 1963 జూలై 4న కన్నుమూశారు.

కె.రోశయ్య (జయంతి)



డాక్టర్ కొణిజేటి రోశయ్య 1933 జూలై 4న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలో జన్మించారు. 2009 నుంచి 2010 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 15వ ముఖ్యమంత్రిగా, 2011 నుంచి 2016 మధ్య తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా, అనంతరం కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జ్ గవర్నర్‌గా వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ ఎమ్మెల్యే, ఎంపీ సహా వివిధ హోదాలలో కొనసాగారు. ప్రత్యేకించి ఆర్థికమంత్రిగా 16సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఉంది. 1994 - 1996 మధ్య ఏపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2007లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2021 డిసెంబరు 4న కన్నుమూశారు.

ఉమా రామారావు (జయంతి)



ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి కే ఉమా రామారావు 1938 జూలై 4న విశాఖపట్నంలో జన్మించారు. కొరియోగ్రాఫర్‌గా, పరిశోధకులుగా, రచయితగా రాణించారు. త్యాగరాజ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ అకాడమీలో సీనియర్ లెక్చరర్‌గా వ్యవహరించారు. తదుపరి హైదరాబాద్‌లో 1985లో ఏర్పాటైన లాస్యప్రియ డ్యాన్స్ అకాడమీ సంస్థాపకులు, డైరెక్టర్‌గా కొనసాగారు. కళా నీరాజనం, కళాప్రపూర్ణ, ప్రతిభా పురస్కారం, సంగీత నాటక అకాడమీ పురస్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 2016 ఆగస్టు 27న కన్నుమూశారు.

ఎంఎం కీరవాణి (పుట్టినరోజు)



ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి 1961 జూలై 4న పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో జన్మించారు. పూర్తి పేరు కోడూరి మరకతమణి కీరవాణి. 1989 నుంచి సంగీత దర్శకుడిగానే కాక గాయకుడిగా, స్వరకల్పనలోనూ, గేయ రచనలోనూ గుర్తింపు పొందారు. ప్రత్యేకించి 'అన్నమయ్య' సినిమాకు ఉత్తమ సంగీత దర్శకుడి పురస్కారం అందుకున్నారు. 8 ఫిల్మ్‌ఫేర్, 11 నంది అవార్డులు పొందారు. తెలుగు సహా ఇతర భాషలలో కలిపి 220కు సినిమాలకు సంగీతం అందించారు. 2022లో ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది. 2023లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు.

ప్రజలతో మమేకం అవ్వండి

పామిడి, జూలై 3(ఆంధ్రజ్యోతి): 'తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి.. పథకాలు అందాయా.... సమస్యలు ఉన్నాయా.. ఆరా తీయాలి. సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కాని కొంతమంది కేవలం తెల్ల ఖద్దర్ బట్టలు వేసుకొని తిరుగుతూ బిల్డప్‌లు ఇస్తున్నారు. ప్రజలు సమస్యలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. అలాంటి వారి వ ల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోంది. ఇకనైనా వారు ఆ బిల్డప్‌లు మాని .. ప్రజలతో మమేకం కావాలి.' అని ఎమ్మె ల్యే గుమ్మనూరు జయరాం పార్టీ శ్రేణులకు హితువు పలికారు. మండలంలోని అనుంపల్లి గ్రామంలో గురువారం ఆయన ఈ మేరకు అసహనం వ్యక్తం చేశారు.

వైసీపీ రంగులను తొలగించరా?: ఎమ్మెల్యే

శెట్టూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం మారినా.. పలు గ్రామాల్లో సచివాలయాలకు ఆ పార్టీ రంగులే ఉన్నాయని, ఎందుకు వాటిని తొలగించలేదని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని అయ్యగార్లపల్లి గ్రామ సచివాలయానికి వైసీపీ రంగులు ఉండటంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అదేవిధంగా పెరుగుపాలెం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకూ వైసీపీ రంగులు తొలగించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఉరవకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం సందర్శించారు. నీట్‌లో ప్రతిభ కనబరిచిన మౌనిక అనే విద్యార్థినికి హార్మోనిసిటీ తరఫున నెట్టెం రవి రూ.50వేల చెక్కును మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అలాగే పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు నర్రాచైతన్య జ్ఞాపకార్థం రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. అనంతరం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పథకం క్రింద మినీ కందుల కిట్లను మంత్రి రైతులకు పంపిణీ చేశారు.

అందని స్ప్రింక్లర్లు.. ఎండుతున్న పంట

డీడీ చెల్లించి ఆరు నెలలైనా మంజూరుకాని వైనం

లబోదిబోమంటున్న రైతు

మడకశిర రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): స్ప్రింక్లర్ల కోసం డీడీ చెల్లించి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు తనకు అందజేయలేదని బాధిత రైతు రేవణ్ణ ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట ఎండిపోతోందని ఆందోళన చెందుతున్నాడు. మండలంలోని ఈచలేడి గ్రామానికి చెందిన రేవణ్ణ ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంపెనీ డీలర్‌కు స్ప్రింక్లర్ల కోసం జనవరిలో రూ.12500 డీడీ చెల్లించాడు. ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ స్ప్రింక్లర్లు అందించలేదు. దీంతో సాగు చేసిన పంటకు నీరు అందక ఎండుముఖం పడుతోందని రేవన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బోరు కింద తనకు ఉన్న ఏకరా భూమిలో వేరుశనగ పంట సాగు చేశానని, పంటకు నీరు అందించేందుకు స్ప్రింక్లర్ల అవసరముండటంతో డీడీ చెల్లించడం జరిగిందని రైతు ఈరన్న పది రోజులలోపు పొలం వద్దకు స్ప్రింక్లర్లు వస్తాయని డీలర్ తెలిపాడన్నారు. ఆరునెలలు గడుస్తున్నా ఇవ్వలేదని లబోదిబోమంటున్నాడు. అనేకమార్లు అడిగినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. ఈవిషయమై ఏపీఎంఐపీ శాఖ డివిజనల్ అధికారి నరసంహప్పను వివరణ కోరగా ఆ డీలర్‌పై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



ఎండుతున్న వేరుశనగ పంటను చూపుతున్న రేవణ్ణ

పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి

టేకులోడులో భూసేకరణపై రైతులకు అవగాహన

చిలమత్తూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమని తహసీల్దార్ నగరాజ్ అన్నారు. గురువారం మండలంలోని టేకులోడు గ్రామంలో భూసేకరణపై రైతులకు అవగాహన నిర్వహించారు. తహసీల్దార్ నటరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చనుందన్నారు. అందుకోసం ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ చేపట్టడం జరిగిందని వివరించారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు వస్తేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. టేకులోడు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారడం హర్షణీయమన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు గరిష్టంగా పరిహారాన్ని చెల్లించే విషయంపై ప్రభుత్వంతో మాట్లాడటానికి ఎమ్మెల్యే బాలకృష్ణ సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు ఏ మాత్రం అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటూనే ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఉద్యోగాల కోసం వలసలు పోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే పరిహారం విషయంలో అన్యాయం జరగకుండా చూడాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటైన తరువాత స్థానికులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణకు ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజమ్మ, టీడీపీ నాయకులు నగరాజుయాదవ్, దేమకేతేపల్లి అంజినప్ప, రంగారెడ్డి, లక్ష్మినారాయణయాదవ్, బేకరీ గంగాధర్, బయపరెడ్డి, చంద్ర, మంజునాథ్, కృష్ణమూర్తి, శ్రీదేవి, గౌరీశంకర్, జనసేన చిన్న ప్రవీణ్, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నటరాజ్

గుంతలమయం..!

కోడూరు తోపు రోడ్డులో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చిలమత్తూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు తోపు రోడ్డు గతుకులమయంగా మారింది. కోడూరు తోపు నుంచి కోడూరు మీదుగా మధురేపల్లికి, సుబ్బరావుపేట, చాగలేరు, పలగలపల్లి తదితర గ్రామాలకు ఈ రోడ్డు ద్వారా వెళ్లవచ్చు. అయితే గుంతలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు అంటున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని వివరిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డు ద్వారా ప్రయాణం చేయాల్సి వస్తే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుని బాగుచేయాలని కోరుతున్నారు.



అధ్వాన్నంగా మారిన కోడూరు తోపు రోడ్డు

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌కృష్ణ

పెనుకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పెనుకొండ డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ కమలాబాయి తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళలు గ్రామీణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

పంటల బీమా నమోదు చేసుకోండి: ఏఓ

అగళి, జూలై 3(ఆంధ్రజ్యోతి): పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ నాగరాజు సూచించారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకానికి సంబంధించి ఖరీఫ్ 2025 కింద పంటలు సాగుచేసుకున్న రైతులు పంటల బీమాను నమోదు చేసుకోవాలన్నారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి: ఎంఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్

అగళి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ-1 భాస్కర్ సూచించారు. మండలంలోని మదుడి ఇనగలూరు మోడల్, కస్తూర్బా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు మంచి బోధనను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయులు దాసేగౌడ, ఆనంద్‌రెడ్డి, వేణుగోపాల్, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ఆశాకిరణ దృష్టి కేంద్రం ప్రారంభం



ఆశాకిరణ దృష్టి కేంద్రం ప్రారంభిస్తున్న వైద్యులు

పావగడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): పావగడ ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతరం కంటి ఆశాకిరణ దృష్టికేంద్రాన్ని టీహెచ్ఓ డాక్టర్ ఎల్‌బాబు, ఏఎం మధుసుధన్ గురువారం ప్రారంభించారు. ప్రతిరోజూ వందలాది మంది కంటి పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వెళ్తుంటారని, వారికి నాణ్యమైన పరీక్షలు నిర్వహించేందుకు దృష్టికేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు.

జాతీయ సదస్సులో పురం చైర్మన్



సదస్సులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): హర్యాణాలోని గురుగ్రామ్‌లో రెండురోజులపాటు జరిగే జాతీయసదస్సులో హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల బాధ్యతలు, చేయాల్సిన పనులు, ప్రజాస్వామ్యంలో వాటిపాత్రపై సదస్సులో ప్రసంగించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

పావగడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): తాలూకా నూతన విద్యాధికారిగా రేణుకమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న ఇంద్రాణమ్మ పదవీవిరమణ పొందడంతో ఆ స్థానంలో రేణుకమ్మ బాధ్యతలు చేపట్టారు. బీఆర్‌సీ వెంకటేష్, సోమశేఖర్, వెంకటేశ్వర, పాఠశాల కోశాధికారి పరంధామరెడ్డి తదితరులు నూతన ఎంఈఓకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

తమటే సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు

పావగడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): సఫాయి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తమటే సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టం కింద కార్మికుల పిల్లలకు ఎన్నో సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ అధికారులు వాటిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధ్యక్షులు సుదేష్‌బాబు సమస్యలు పరిష్కరిస్తానన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ బసవలింగప్ప, మున్సిపల్ ఉపాధ్యక్షులు మాలిన్‌తాజ్, ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్ పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

గోరంట్ల, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మద్యంరవాణాలో పట్టుబడిన పాతకేసులకు సంబంధించిన 78 కేసుల మద్యం బాటిళ్లు, టెట్రా ప్యాకెట్లును గురువారం ఎక్సైజ్, పోలీసులు ధ్వంసం చేశారు. పుట్టపర్తి ఎక్సైజ్ డివిజినల్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, గోరంట్ల సీఐ శేఖర్ ఆధ్వర్యంలో రూ.16లక్షల విలువ చేసే మద్యాన్ని ధ్వంసంచేశారు.



మద్యం బాటిళ్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్‌పై చర్యలకు కాంగ్రెస్ డిమాండ్

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధానకార్యదర్శి పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎమ్మెల్సీ రవికుమార్ విధానసౌధ ప్రాంగణంలోని గాంధి విగ్రహం వద్ద చేసిన ఆందోళనల సందర్భంలో మాట్లాడుతూ రాత్రి వేళలో ప్రభుత్వ కార్యకలాపాలను పగటి వేళల్లో ముఖ్యమంత్రి పనులు చేస్తారంటూ సీఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఓ మహిళాధికారి పట్ల ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు మండిపడుతున్నారు. కేపీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ విధానసౌధ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వంటి ఉన్నత హోదాలో కొనసాగే మహిళా అధికారి పట్ల చులకనగా మాట్లాడం సరికాదని వెంటనే చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా గురువారం యూత్‌కాంగ్రెస్ ప్రతినిధులతో పాటు వివిధ విభాగాలకు చెందిన ముఖ్యులు విధానపరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టిని కలిశారు. ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఐటీబీటీ శాఖా మంత్రి ప్రియాంకఖర్గే స్పందిస్తూ ఇది విచిత్రమైన మనుషుల మనస్థితిగా అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్‌లో ఇటువంటివే నేర్పుతారన్నారు. వీరు సొంతంగా ఎన్నికలలో గెలువలేని వారని అందుకే పరోక్ష మార్గంలోనే చట్టసభలకు వస్తారన్నారు.

రైతులను అణచివేసే నిర్ణయాలు సరికాదు

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా పంటలసాగుతోనే జీవనం సాగిస్తున్న రైతులను అణచివేసేలాంటి నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకోవడం సరికాదని భారతీయ కిసాన్ యూనియన్ ముఖ్యులు రాకేష్ టికాయత్ మండిపడ్డారు. దేవనహళ్ళి గ్రామస్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న నిరసనకు గురువారం రాకేష్ టికాయత్ మద్దతిచ్చారు. ఇదే సందర్భంగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేవనహళ్ళి పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకంటూ ఎంతోభూమిని ఆక్రమించుకున్నారన్నారు. రైతులకు ఇష్టం లేకున్నా బలవంతంగా ప్రభుత్వం స్వాధీనంకు సిద్దం కావడం సరికాదన్నారు. దేవనహళ్ళి రైతులకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఉపాధ్యాయుల కారు బోల్తా

డీ.హీరేహాళ్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశలపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం ఉపాధ్యాయులు వెళ్తున్న ఓ కారు బోల్తా పడటంతో వారంతా స్వల్పంగా గాయపడ్డారు. గొడిశలపల్లి జడ్పీ పాఠశాలలో పని చేసే ఐదుగురు ఉపాధ్యాయులు రోజూ కారులో అనంతపురం నుంచి వచ్చి వెళ్లేవారు. గురువారం విధులు ముగించుకొని.. సాయంత్రం అనంతపురం వస్తుండగా.. మలుపు వద్ద ఆ కారు టైర్ పేలిపోవడంతో.. ఆ వాహనం పక్కనే పొలాల్లోకి బోల్తా పడింది. ఆ ఉపాధ్యాయులతో పాటు కారు డ్రైవరూ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించారు. అనంతరం మరో వాహనంలో వారిని ఇళ్లకు పంపారు.

రైల్వే ఉద్యోగికి గాయాలు

గుంతకల్లు టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసీఎస్ మిల్లు సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వే గ్యాంగ్‌మన్ సతీష్‌కుమార్ గాయపడ్డాడు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న సతీష్‌కుమార్ ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా.. ఎదురుగా వచ్చే ఆటోను ఢీకొన్నాడు. గాయపడిన అతన్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని రైల్వే ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

16 గొర్రెలు, మేకల మృతి

బెళుగుప్ప, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపల్లిలో గురువారం 16 గొర్రెలు, మేకలు మరణించాయి. కాలువపల్లి సమీపంలోని వ్యవసాయ తోటలో మొక్కజొన్న పంట కోసం నీటి తొట్టెలో యూరియా కలిపి ఉంచారు. ఇది గమనించని గొర్రెల కాపర్లు ఆ నీరు తాగించారు. దీంతో తిప్పయ్యకు చెందిన ఐదు గొర్రెలు, మహేష్‌కు చెందిన ఒక గొర్రె, ఒక మేక, వన్నూరుస్వామి రెండు గొర్రెలు, ఒక మేక, రామాంజినేయులు రెండు గొర్రెలు, అంజినప్ప ఒక మేక, లింగన్న ఒక గొర్రె, ఒక పొట్టేలు, మల్లప్పకు ఒక మేక మరణించాయి. మరికొన్ని అస్వస్థతకు గురయ్యారు. సచివాలయ పశువైద్య సిబ్బంది యర్రిస్వామి వాటిని పరిశీలించి డాక్టర్‌కు వివరాలు పంపారు. రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఇంట్లో చోరీ

యాడికి, జూలై 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామికాలనీ వాసి కృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. అతను, అతని భార్య పనులపై బుధవారం బయటకు వెళ్లారు. తాళాలు పగలగొట్టి.. ఇంట్లో చొరబడిన దుండగులు.. బీరువాలోని రూ. 1.20 లక్షల విలువైన (2.5 తులాలు) బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన కృష్ణ .. ఇంట్లో చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

డీ.హీరేహాళ్, జూలై 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి వైపు నుంచి బొలెరో (కేఏ 34డీ 1321) వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని లింగమనహళ్లి గ్రామ సమీపంలోని నేషనల్ హైవేపై గురువారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. ఆ వాహనాన్ని, డ్రైవర్ తిప్పేష్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని, రేషన్ బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డికి అప్పగించారు. ఆ వాహన యజమాని సురేష్‌పై కూడా కేసు నమోదు చేసి.. వాహనాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

యల్లనూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాయమం ద గ్రామంలో శ్రీరంగనాయకులుకు చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పుపెట్టడంతో అది దగ్ధమైందని ఎస్ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు.

జూదరుల అరెస్ట్

బొమ్మనహాళ్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరిలో గురువారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వారి నుంచి రూ.5,200 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నామని, మరో ఆరుగురు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.53	1587.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	26,718	604
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,748	297
నీటి నిల్వ (టీఎంసీలు)	78.24	8.78

పరిహారం చెల్లించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కర్ణాటక దళిత హక్కుల కమిటీ నాయకులు

బళ్లారి సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిందాల్ ఫ్యాక్టరీ డంపింగ్ యార్డులో మృతి చెందిన కటుఉంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తుమటి ప్రాంతంలో జిందాల్ ఫ్యాక్టరీ డంపింగ్ యార్డ్‌లో దళితులు, రామాంజనేయ, హొన్నూరు స్వామి ఇనుప ముక్కలను సేకరిస్తూ మర ణించిన విషయం తెలిసిందే. రెండేళ్లు గడిచినా గడిచినా కాంట్రాక్టర్ లేదా జిందాల్ కంపెనీ ఎటువంటి పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ రెండు కటుంబాలు నిరాశ్రయుల య్యాయన్నారు. వారికి ప్రభుత్వం లేదా కంపెనీ వెంటనే పునరావాసం కల్పించాలన్నారు. న్యాయవాది బాదామి శివలింగ నాయక మాట్లాడుతూ.. ఘటన జరిగి రెండు న్నర సంవత్సరాలు గడిచినా కంపెనీగానీ, కాంట్రా క్టర్‌గానీ బాధిత కుటుంబాలను సంప్రదించలేదని, ఆ కుటుంబాలకు ఎటువంటి పరిహారం అందించలేదని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, ఫ్యాక్టరీ నుంచి లేదా జిల్లా యంత్రాంగం పునరావాసం కల్పించాలని, కుటుం బానికి పరిహారం అందించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తూ ఆయనకు వినతిపత్రాన్ని పంపారు. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం శివశంకర్, ముదిమల్లయ్య, విజయ్ కుమార్, జంబయ్యనాయక, షేక గంగాధర్, దుర్గమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత



వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

బళ్లారి రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అసుండి కొత్త బైపాస్ సమీపంలో బుధవారం సాయంత్రం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ నేతృత్వంలో 72 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకు న్నారు. ఒక ఐచర్ వాహనం, రెండు టాటా, అశోక్ లేలాండ్ ఆటోలు, బజాజ్ ఆటోల్లో బియ్యాన్ని తరలి స్తున్న యువరాజు, మహమ్మద్ గౌసలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 185 ప్లాస్టిక్ బ్యాగుల్లో ఉన్న రూ.1.70 లక్షలు విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసు కుని, కేసు నమోదు చేసుకున్నట్లు పీడీఎల్‌ఏ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే గోపాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అడ్వకేట్ జయరాములు

బళ్లారిరూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మొలకా ల్మూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ జన్మదిన వేడుకలు గురు వారం ఘనంగా నిర్వహించారు. రాంపురం గ్రామంలోని ఆయన స్వగృహంలో బళ్లారి అడ్వకేట్ జయరాం, రిటైర్డ్ హెచ్ఎం రామచంద్రప్ప, బసవరాజు, గణేష్, సురేష్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పంటలకు బీమా చేసుకోవాలి

సిరుగుప్ప, జూలై3(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పంట బీమా పాలసీ జూలై 31లోగా చేసుకోవాలని తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీ పాటిల్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాగి, జొన్న, కందులు, పత్తి, వరి, తదితర పంటలు పండించే రైతులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలన్నారు. పంటలు పండక పోయినా వరదలు వచ్చి దెబ్బతిన్నా నష్టపరిహారంతో పాటు బీమా కూడా వర్తిస్తుందన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి శనివారం అసంఘటిత కార్మికులకు అందించే సౌకర్యాల కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని ఎంపీ తుకారాం సూచించారు. గురువారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ముందస్తు సమావేశానికి ఆయన అధ్య క్షత వహించి మాట్లాడారు. బళ్లారి జిల్లాలోని వివిధ వర్గాల అసంఘటిత కార్మికులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసేందుకు, పథకాల గురించి అవగా హన కల్పించడానికి శనివారం నగరంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమం ప్రభుత్వ ఆకాంక్ష కార్యక్రమమని దీనిని విజయవంతం చేసేం దుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమానికి కార్మిక మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. కార్యక్రమం సజావుగా నిర్వహించ డానికి అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్మికశాఖలో 28 వేర్వేరు అసంఘటిత కార్మికుల సంఘాల కింద నమోదు చేసుకున్న 2,600 మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేసి, వివిధ పథకాల గురించి అవగా హన కల్పిస్తారన్నారు. లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకువచ్చేందుకు 28 బస్సులు, 15 క్రూజర్ వాహనాలు, 500 ఆటోలను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఎటువంటి గందరగోళం లేకుండా చూసుకోవాలని రవాణా అధికారు లను ఆదేశించారు. కార్యక్రమం గురించి మరింత ప్రచారం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అధికారిక ప్రదేశాలలో బ్యానర్లు ఏర్పాటు చేయా లని, నగర సుందరీకరణ ప్రభావితం కాకూడదన్నారు. కార్మికశాఖ రాష్ట్రం, జిల్లా నుంచి సమగ్ర సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. సమావేశంలో బాబు జగ్జీవన్‌రామ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధ్యక్షుడు ముండరగి నాగరాజ్, బళ్లారి సబ్‌డివిజనల్ లేబర్ ఆఫీసర్ సిద్దప్ప ఖైనూర్, లేబర్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్, 1వ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జిల్లా చైల్డ్‌లేబర్ ఆఫీసర్ మౌనేశ్, వివిధ శాఖల అధి కారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నోటిఫికేషన్ రద్దు చేయాలి

● సంఘం అధ్యక్షుడు దురుగప్ప



మాట్లాడుతున్న దురుగప్ప, పదాధికారులు

బళ్లారి సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకులుగా గత ఏడాది విధులు నిర్వర్తించిన వారికి పనిభారాన్ని తగ్గించాలని, కౌన్సెలింగ్ ద్వారా కొత్త వ్యక్తులను ఎంపిక చేయాలని, గతనెల 25న ప్రభుత్వం జారీచేసిన నోటిఫికే షన్‌ను రద్దుచేయాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు దురుగప్ప ప్రభు త్వాన్ని కోరారు. నగరంలోని పత్రిక భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25లో ఫస్ట్‌గ్రేడ్ కళాశాలల్లో పనిచేసిన గెస్ట్‌లెక్చరర్లను ఎటువంటి వివక్షత లేకుండా వారి పదవుల్లో కొన సాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పదవీ విరమణ అంచున ఉన్న లెక్చరర్లకు రూ.20లక్షల పెన్షన్, సర్వీస్ సెక్యూరిటీ కల్పించాలన్నారు. పొరుగు రాష్ట్రాల మాదిరిగా గెస్ట్ లెక్చరర్లకు రూ.65 నుంచి 67వేల జీతం నిర్ణయించా లని, ఆరోగ్య బీమా, ప్రావిడెండ్ ఫండ్ సహాఅన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. యూజీసీ, నాన్ యూజీసీ మధ్య వివక్షతను పక్కనపెట్టి ప్రభుత్వ కళాశాలల్లో పదేళ్లపాటు సేవలందించిన లెక్చరర్లను శాశ్వత లెక్కచరర్లుగా ప్రకటించాలని హైకోర్టు దార్వాడ డివిజన్ బెంచ్ ఆదేశించిందన్నారు. దీని ప్రకారం ఉత్తర్వును అమలుచేయాలన్నారు. నగరంలోని సరళాదేవి కళాశాలలో 33మంది శాశ్వత లెక్చరర్లు, 110మంది గెస్ట్‌లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. కౌన్సెలింగ్ నెపంతో పదేపదే గెస్ట్ లెక్చరర్లను మానసిక రోగులుగా మారుస్తున్న కళాశాల విద్యా శాఖ సరికాదన్నారు. కార్యదర్శి సిద్దేశ్, సంయుక్త కార్యదర్శి రుద్రముని, జయ రామ్, శివకుమార్ అంగడి, సంధ్యాబాయి, రాజలక్ష్మి శోభాజ్యోతి, గురురాజ్, రమేశ్, రవీ, రామన్న, చరణప్ప, బాలచంద్ర, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ప్రబలుతున్న డెంగీ, మలేరియా

● ఏ ఇంట్లో చూసినా ఇద్దరు, ముగ్గురు బాధితులు
● ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు
● పట్టించుకోని వైద్యశాఖ అధికారులు



సమస్యను వివరిస్తున్న శాంతినగర్ ప్రజలు

కంప్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): తాలుకా సమీపంలోని నెల్లూడి గ్రామ పంచాయతీ శాంతినగర్ ఏ ఇంట్లో చూసినా డెంగీ, మలేరియా రోగాలతో మంచానికే పరిమితమయ్యారని సభ్యులు సుధాకర్ తెలిపారు. గురువారం శాంతినగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. పది రోజులుగా ప్రజలు డెంగీ, మలేరి యాతో ఉన్నా ప్రభుత్వాస్పత్రిలలో సరైన చికిత్సలు అందకపోవడంతో ఇక్కడి పేదలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి రుణాలు తీసుకుని చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురికి జ్వరం వచ్చి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యులు, ఆశా కార్యకర్తలు ఆ ప్రదేశాన్ని సందర్శించి కొందరిని పరీక్షించి వైరల్ జ్వరమని చెబుతున్నారన్నారు. నెల్లూడి గ్రామ పంచాయతీ శాంతినగ ర్‌లో డెంగీతో 20 మందికి పైగా ప్రైవేటు ఆస్పత్రులలో చేరి చికిత్సలు పొందా రన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న తాలుకా ఈవో శ్రీకుమార్, మల్లన్న గౌడ, రామచంద్రప్ప, శేషగిరి శాంతినగర్‌కు చేరుకుని పరిశీలించారు. రోగాల బారిన ప్రతి ఒక్కరికి ఆరోగ్యశాఖ అధికారులు చికిత్సలు కల్పించాలని సూచిం చారు. ఈ సందర్భంగా పంచాయతీ సభ్యురాలు పార్వతి, ఖాజాహుస్సేన్, రాజమ్మ, నాగవేణి, యంకమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాలనీని పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

అన్నపూర్ణమ్మ సేవలు మరువలేనివి

కంప్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): పాత నెల్లూడిలో 15 ఏళ్లకుపైగా ఆశా కార్యక ర్తగా విధులు చేపట్టిన అన్నపూర్ణమ్మ సేవలు మరువలేనివని ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. గురువారం అన్నపూర్ణమ్మ పదవీ విరమణ పొందడంతో ఆమెకు గురువారం ఆరోగ్యశాఖ, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. మహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలు లెక్కచేయకుండా పాత నెల్లూడిలో ఇంటింటా సర్వే చేపట్టి ఆరోగ్య అధికారులకు రిపోర్టును అందించేవా రన్నారు. ఆమె చేసిన సేవలు అటు గ్రామంలోనూ ఇటు ఆరోగ్య శాఖలోనూ గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఒక్కరు అన్నపూర్ణమ్మను ఆదర్శంగా తీసుకోవా లని సూచించారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తమకు పాత నెల్లూడి గ్రామ ప్రజలు, తోటి సిబ్బంది ఆరోగ్య శాఖ అధికారులు ఎంతో సహకారం అందించారని అన్నారు. ప్రతి ఒక్క ఆశా కార్యకర్తలు గ్రామంలోని ప్రజలు, అధికారులతో అన్యో న్యంగా వుంటూ విధులు నిర్వహించు కోవాలని సూచించారు. అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. సాదిక్, కనకప్ప, విష్ణుమూర్తి, బసవన్నగౌడ, విజ్ఞేశ్వర, గీత, పూజ, బాబే, నంద, హనుమంతప్ప, సుధ ముత్యాలమ్మ, అశ్విని, సుమిత్ర పాల్గొ



అన్నపూర్ణమ్మను సన్మానిస్తున్న వైద్యులు, ఆశా కార్యకర్తలు

జైలులో మొబైల్ ఫోన్లు నిషేధం

● సూపరింటెండెంట్ లత



బళ్లారి కేంద్ర కారాగారం

బళ్లారి సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర కారాగారంలోకి మొబైల్ ఫోన్లు ఇతర నిషేధిత వస్తువులు తీసుకురాకుండా చర్యలు చేపట్టినట్లు జైలుఉ సూపరింటెండెంట్ ఆర్.లత అన్నారు. బుధవారం బళ్లారి సెంట్రల్ జైలు గురించి టీవీ సోషల్ మీడియాలో ప్రసారమైన ఫుటేజీ తమకు సంబంధించి కాదని, జైలు నుంచి తీసిన ఏ ఫుటేజీ వైరల్ కాలేదన్నారు. హర్ష హత్యకేసులో నిందితులు ఈజైలులో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా వారిని ప్రత్యేక భద్రతలో ఉంచారు. ఖైదీలు తమను వేరే జైలుకు బదిలీ చేయాలని అభ్యర్థిం చారు. కానీ ఆ బదిలీని కోర్టు తిరస్కరించింది. ఖైదీలు, జైలు సిబ్బందికి వ్యతి రేకంగా వీడియోలను విడుదల చేస్తామని బెదిరించారన్నారు. జైలు గురించి టీవీ, సోషల్ మీడియాలో ప్రసారం చేసిన ఫుటేజీలోని ఖైదీలను ఇప్పటికే విడుదల చేశారు. బుధవారం టీవీ సోషల్‌మీడియాలో షేర్ చేయబడిన ఫుటే జీని పరిశీలించినప్పుడు అది ప్రస్తుత రోజుల్లోని ఫుటేజ్ కాదని తేలింది. ఇది పరిపాలనను వ్యతిరేకించడానికి, సిబ్బందిని నిరుత్సాహ పరిచేందుకు ఖైదీలు పన్నిన వ్యూహమని సూపరింటెండెంట్ లత స్పష్టం చేశారు.



గ్రామ లెక్కల అధికారులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉత్తమ సేవలతోనే గుర్తింపు: ఎమ్మెల్యే

కంప్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తాను చేపట్టే సేవల వల్లనే గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. గురువారం కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో గ్రామలెక్కల అధి కారులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ రెవెన్యూ శాఖలో అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి వారి డేటా ఎంట్రీని సులభతరం చేయడానికి ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లను అందిం చిందని, ఈ ప్రాజెక్టును వేగంగా మంచి వినియోగంతో అమలు చేయాలని ఆయన అన్నారు. ఇక్కడ 13 మంది గ్రామ పరిపాలన అధికారులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవలు చేపట్టే ఏ ఉద్యో గమైనా గుర్తిస్తుందన్నారు. వారికి కావలసిన సదుపాయాలు కూడా కల్పి స్తుందన్నారు. గతంలో గ్రామలెక్కల అధికారులు సరైన వసతులు కల్పించా లని వినతిపత్రం ఇచ్చారన్నారు. గ్రామాల నుంచి ప్రజలు, రైతులు తమ సమస్యలపై వచ్చినప్పుడు పనులు త్వరగా ముగించాలన్నారు. కౌన్సిలర్ కేఎస్ చాంద్ బాషా, సీఆర్ హనుమంత, తహసీల్దార్ మంజునాథ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, ఆర్ఐ జగదీష్, శిరసుదార రమేష్ గ్రామాలకు అధికారులు తదితర నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సిరుగుప్ప, జూలై 3(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణం విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో బుద్ధిమాంద్య పిల్లలకు త్రిచక్ర సైకిళ్లను పంపిణీ చేశారు. ఆంధ్ర సరిహద్దు పాఠశాల విద్యార్థులకు పుస్త కాల పంపిణీ, పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యా ర్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యాశాఖాధికారి గురప్ప, సమన్వయ అధికారి తమ్మన్న గౌడ పాటిల్, బుద్ధిమాంద్య పిల్లల సంస్థ వ్యవస్థాపకులు మహేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



శరణయ్యస్వామి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు శరణయ్యస్వామి సే వలు ఎంతో అమోఘమని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముఖ్య ఉపా ధ్యాయురాలు నేత్రావతి అభిప్రాయం వ్యక్తం చేశారు. తాలుకాలోని దడే సూగూరు గ్రామంలో సేవలు చేస్తున్న శరణయ్యస్వామి రిటైర్మెంట్ పొందా రు. ఈ సందర్భంగా విద్యాశాఖ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వివిధ సం ఘాల అభిమానుల ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఆయనకు పూలమాలలు వేసి సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు నేత్రావతి మాట్లాడుతూ 35 ఏళ్ల సుదీర్ఘ సేవలు అందించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపా ధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. సింధనూరు తాలుకా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళ కాలిపై దూసుకెళ్లిన లారీ



ప్రమాదానికి కారణమైన లారీ

రాయచూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు నగరంలో గురువారం మధ్యహ్నం రోడ్డు దాటుతున్న మహిళ కాలిపై లారీ వేగంగా దూ సుకెళ్లింది. మహిళ పాదం పూర్తి నుజ్జును జ్జు కాగా ఆమె బోరున విలపిస్తూ రోడ్డుపై కుప్పకూలగా సమీపంలో ఉన్న యువకు లు దగ్గరికి వెళ్లి ఆమెను ఓదార్చి వెంటనే ఆటోలో తాలూకా ఆస్పత్రికి తరలించారు. లారీ ఆచూకీ కోసం స్థానికులు గాలింపు చేపట్టారు. మహిళ బూదినాళ క్యాంప్‌నకు చెందిన మహెబూబిగా గుర్తించారు. లారీ గంగావతి వైపు నుంచి సింధనూరుకు వస్తున్న సందర్భంగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

రెండుచోట్ల పేలిన గ్యాస్ సిలిండర్

రాయచూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో వంట గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రాయ చూరు తాలూకాలోని మన్సలాపూర్‌లో బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు రామప్ప గౌడ ఇంట్లో వంట వండేందుకు గ్యాస్ స్టౌవ్‌ను ఆన్ చేయగా లీకేజీ ఉండడంతో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో కిచెన్ తలుపులు విరిగిపోగా కిటికీకి అమర్చిన గ్లాస్ పలిగిపోయింది. అప్రమత్త మైన ఇంటి యజమాని విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఇంట్లో ముగ్గురు వ్యక్తులు మాత్రమే ఉండగా ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు అక్కడికి వెళ్లి మంటలార్పే ప్రయత్నం చేయడంతో పాటు పైప్ లీకేజీ అయినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తల వివరించారు. నగర సమీపం రాయచూరు-హైదరాబాద్ రహదా రిలో ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌ను వేసేందుకు ఉపయోగిస్తున్న సిలిం డర్ పేలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఒక వాహనంలో సిలిండర్లు ఉంచిన సిబ్బంది అక్కడే వంటలు చేసుకుంటూ రోడ్డుపై నిబంధనల గుర్తు లను వేసే పని చేపట్టారు. ఈ క్రమంలో ఒక సిలిండర్ పేలడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడికి వచ్చి మంటలను ఆర్పేశారు.



సిలిండర్ పేలడంతో దెబ్బతిన్న వాహనం

హోసూరు జోన్

మెరుగైన వైద్యమే లక్ష్యం: ఎమ్మెల్యే

హోసూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగుతోందని ఎమ్మెల్యే వై ప్రకా శ్ అభిప్రాయపడ్డారు. హోసూరు తాలూకాలోని కామరాజ్‌నగర్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. చెన్నై అడయార్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ రూపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం వివిధ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పీపుల్స్ హెల్త్‌కేర్ స్కీమ్ ద్వారా మధుమేహం, రక్తపోటు వంటి వారికి ఇళ్లచెంతనే ఔష ధాలు పంపిణీ చేయడంలో తమిళనాడు అగ్రగామిగా ఉందన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

అదే విధంగా ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం కింద ప్రభుత్వ, గుర్తింపుపొందిన ప్రైవేట్ ఆసుపత్రులలో సంవత్సరానికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు తమ రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రంతో ముఖ్యమంత్రి సమగ్ర వైద్యబీమా కార్డుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. ఈ అంశంపై ప్రతి గ్రామంలోనూ అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇంకా పదం కాపోమ్ పథకం కింద డయాబెటిస్ వల్ల పాదా లకు కలిగే నష్టాన్ని ప్రారంభదశలోనే గుర్తించి, తగిన చికిత్సలు అంది స్తారన్నారు. ఇలా వైద్యానికి సంబంధించి పలు పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రజలకు వైద్య సౌకర్యాలు కల్పించ డానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను పునరుద్ధరించడం, కొత్తవి నిర్మించడం జరుగుతోందన్నారు. ప్రస్తుత కామరాజ్‌నగర్‌లో 3247 అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎమర్జెన్సీ వార్డు, ల్యాబరేటరీ, లేబర్‌రూం, డ్రెస్సింగ్‌రూం, ఇంజెక్షన్ రూం, ఫార్మసీతోపాటు రోగులకు వీలుగా శౌచాలయం ఉందన్నారు. ఒక వైద్య అధికారి, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ముగ్గురు నర్సులు, ఇద్దరు సిబ్బంది ఉంటారన్నారు. మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ మహ్మద్ షబీర్ ఆలం, ఆరోగ్యస్థాయి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్, ఐఎన్‌టీ యూసీ మునిరాజ్, డీఎంకే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.2,500 కోట్ల ప్రాజెక్టు పనులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గానికి గడిచిన నాలుగేళ్లలో రూ.1,500 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు పూర్తి కాగా ఈ ఏడాది మరో రూ.1,000కోట్ల ప్రాజెక్టు పనులు ప్రకటించగా వాటి పనులు జరుగుతు న్నాయని ఎమ్మెల్యే వై ప్రకాశ్ తెలిపారు. హోసూరు రాంనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద బుధవారం రాత్రి ఏర్పాటైన డీఎంకే సమావేశం జరిగింది. హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య, వేపనహళ్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, చీఫ్ స్పీకర్ ఇళయగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంకే కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ ప్రసంగిస్తూ ఆగస్టు 15వరకు కృష్ణగిరి పశ్చిమ జిల్లా పరిధిలోని పోలింగ్‌కేంద్రాలలోని ఇళ్లను డీఎంకే నాయకులు సందర్శించి పార్టీలో చేరేందుకు సమ్మతిస్తారా అనే సర్వే చేపడతారన్నారు. ఇదే సందర్భంగా సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. డీఎంకే నాలుగేళ్ల పాలన సాధనపై ఒక జాబితాతో పుస్తకాన్ని రూపొందించామన్నారు. సాధనా పుస్తకా న్నిప్రతి ఇంటికి ఇస్తామన్నారు. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలలో 95శాతం నెరవేర్చిన దేశంలోని ఏకైక ముఖ్యమంత్రి ఏకే స్టాలిన్ అన్నారు. మరోసారి డీఎంకేను ఆదరించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.